క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.50వేల విరాళం



నిర్వాహకులకు నగదు అందజేస్తున్న దాత

బనగానపల్లె రూరల్: టంగుటూరు గ్రామంలోని పెద్దమ్మ ఆలయ ఆవరణలో ఉన్న నిత్యాన్నదాన సంస్థకు కోవెలకుంట్ల మండలం వల్లంపాడు గ్రామానికి చెందిన బూజూటి బాలచంద్రమ్మ రూ.50వేల నగదును బుధవారం విరాళంగా అందజేశారు. నిర్వాహకుడు రామగంగి రెడ్డి ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ



రోడ్డుపై కూలిన విద్యుత్ స్తంభం

బేతంచెర్ల: స్థానిక నంద్యాల క్రాస్ రోడ్డులోని శేషారెడ్డి సర్కిల్ వద్ద బుధవారం ఉదయం విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీకొనడంతో రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. సమాచారం అందుకున్న విద్యుత్ అధికారులు సరఫరా నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్‌శాఖ టౌన్ ఏఈ మహబూబ్ వలీ, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

సమస్యలపై మంత్రికి వినతి

బనగానపల్లె రూరల్: రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి బుధవారం తన క్యాంపు ఆఫీస్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వారి నుంచి అర్జీలు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

పౌష్టికాహారంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

బేతంచెర్ల: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డా ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాధమ్మ అన్నారు. బుధవారం పట్టణంలోని సంజీవనగర్ 14వ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణితో పాటు కడుపులో ఉన్న శిశువు ఆరోగ్యంగా ఉండాలంటే ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం దుర్గ, అంగన్‌వాడీ కార్యకర్తలు రాధమ్మ, రామాదేవి, మల్లేశ్వరి పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఏఈ

ప్యాపిలి: మండల పరిధిలోని పోతుదొడ్డిలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేశారు. బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ కోసం ఏర్పాటు చేసిన ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన దుండగులు అందులో ఉన్న కాపర్ తీగలను అపహరించారు. సమాచారం అందుకున్న ట్రాన్స్‌కో ఏఈ వినయ్ కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్యాపిలి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తులు

బేతంచెర్ల: ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీలో పది, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు రూ.200 రుసుంతో ఈనెల 25వ తేదీ వరకు అవకాశం ఉందని భాగ్యోదయ హైస్కూల్ చైర్మన్ కానాల నాగలక్ష్మి దేవి బుధవారం తెలిపారు. వివరాలకు పాఠశాల పని వేళల్లో సంప్రదించాలన్నారు. పబ్లిక్ పరీక్షలు మార్చి లేదా ఏప్రిల్ నెలలో ఉంటాయని పేర్కొన్నారు. ప్రతి రెండో శనివారం, ఆదివారం తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. చదువు మధ్యలో మానివేసిన వారు, ప్రభుత్వ ఉద్యోగులు పదోన్నతి కోసం ఈ కోర్సుల్లో చేరవచ్చని సూచించారు.

రైతులను ఆదుకోవాలని వినతి

బేతంచెర్ల: ఎన్డీఏ ప్రభుత్వం 2023 ఖరీఫ్, రబీ పంటల బీమాను ప్రకటించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, బాల శేఖర్ కోరారు. రైతు సమస్యలపై బుధవారం మండలంలోని బుగ్గానిపల్లె సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.



కోవెలకుంట్ల: పట్టణంలో వినాయక విగ్రహాల ఊరేగింపు



ఊరేగింపులో యువకుల కోలాహలం



డోన్‌లో నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారి



బనగానపల్లె: బేతాళ నృత్య కళాకారులు

వినాయకా.. వీడ్కోలిక

గణపతి బప్పా మోరియా, జై బోలో గణేష్ మహరాజ్ కీ జై అంటూ నినదిస్తూ వినాయకుడి నిమజ్జన వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో చిన్నాపెద్దా తేడా లేకుండా రంగులు చల్లుకుంటూ డప్పువాయిద్యాలకు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. కోవెలకుంట్ల గణనాథులను కుందూ నదిలో.. బనగానపల్లెలో కొలువుంచిన లంబోదరుడి విగ్రహాలను కైప చెరువులో నిమజ్జనం చేశారు.

- ఘనంగా గణేష్ నిమజ్జనం
- ఉత్సాహంగా శోభా యాత్ర
- రంగులు చల్లుకుంటూ సందడి చేసిన యువకులు
- ఆకట్టుకున్న నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు
- కుందూనదిలో కోవెలకుంట్ల వినాయక విగ్రహాల నిమజ్జనం

కోవెలకుంట్ల: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా బనగానపల్లె నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కొలువుదీరిన గణనాథుల నిమజ్జన కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. డోంట్ స్టాప్ డ్యాన్సింగ్.. పూనకాలు లోడింగ్ అంటూ యువకులు రంగలు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ సందడి చేశారు. కోవెలకుంట్ల పట్టణంలోని గాంధీ నగర్, రంగరాజుపేట, కుమ్మరివీధి, సంతపేట, నాగులకట్ట, గడ్డవీధి, సాయినగర్, ఇందిరానగర్, సీతారామనగర్ తదితర ప్రధాన కూడళ్లతోపాటు 61 ప్రదేశాల్లో కొలువుదీరిన గణనాథులు ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలందుకున్నారు. నిమజ్జనాన్ని పురస్కరించుకుని చివరి రోజు ఆయా మండపాల్లో వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని పురవీధుల మీదుగా ఏకదంతుడి విగ్రహాల ఊరేగింపు వైభవంగా సాగింది. గ్రామ పంచాయతీ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, ముదిగేడు చౌరస్తా, పాండురంగస్వామి దేవాలయం, సంతపేట, గాంధీసెంటర్, అంకాలమ్మ చౌరస్తా మీదుగా అశేష జనవాహిని, భక్తుల మధ్య పట్టణ శివారులోని కుందూనదిలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. శోభా యాత్రలో యువకుల నృత్యాలు, డీజే, డ్రమ్స్ అలరించాయి. కుందూనది ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తమ సిబ్బందితో కుందూనది వద్ద గట్టి బందోబస్తు నిర్వహించారు. భక్తులను నదిలో దిగనీయకుండా గజ ఈతగాళ్ల సాయంతో విగ్రహాలను నిమజ్జంగా చేసేలా చర్యలు తీసుకున్నారు.

ఘనంగా గణనాథుల నిమజ్జనం

బనగానపల్లె: పట్టణంలో సుమారు 50 మండపాల్లో గణనాథులను ఏర్పాటు చేశారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం విగ్రహాలను ట్రాక్టర్లు, ఆటోలు, జేసీబీ తదితర వాహనాల్లో కొలువీదీర్చారు. గణనాథులు వెళ్తుండగా భక్తులు రంగులు చెల్లుకుంటూ ఉత్సావాహంగా ముందుకు సాగారు. అనంతరం మండలంలోని కైప గ్రామ సమీపంలోని చెరువు వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్రేన్ సహాయంతో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. బనగానపల్లె సీఐ కృష్ణయ్య, బనగానపల్లె, నందివర్గం ఎస్ఐలు దుగ్గిరెడ్డి, వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



బనగానపలె కైప చెరువు వద్ద గణనాథుల నిమజ్జనం

సంజామల: మండల కేంద్రంలో కొలువుదీరిన గణనాథులను బుధవారం నిమజ్జనం చేశారు. యువకుల నృత్యాలు, కళాకారుల చెక్కభజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. సంజామలలో 8 విగ్రహాలను నిమజ్జనం చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

డోన్ టౌన్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఇందిరానగర్ వినాయక మండపంలో చిన్నారులు చేసిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. పట్టణానికి చెందిన డాన్స్ మాస్టర్ హరినాథ్ ఆధ్వర్యంలో 8 మంది బాలికలు నృత్య ప్రదర్శన ఇచ్చారు. వీరికి బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతి అందజేశారు. మండప కమిటీ సభ్యులు మురళి, శ్రీనివాసులు, బాలరాజు, శంకర్‌గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, సుబ్బన్న పాల్గొన్నారు.



డోన్‌లో గణనాథుల నిమజ్జనం



కుందూనదిలో వినాయక విగ్రహాల నిమజ్జనం



సంజామల: ఊరేగింపులో చెక్క భజన చేస్తున్న కళాకారులు



పౌరాణిక నాటకం



డోన్: అన్నదానం



డోన్: శోభాయాత్రగా వెళుతున్న వినాయకులు



వెంకటాపురం చెరువులో నిమజ్జనం



డోన్: నిమజ్జనం తిలకించేందుకు తరలివచ్చిన భక్తులు

కనుల పండువగా శోభాయాత్ర

డోన్ టౌన్: వినాయక చవితి నుంచి ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలందుకున్న గణనాథులు బుధవారం నిమజ్జనంలో భాగంగా గంగమ్మ ఒడికి చేరారు. డోన్ పట్టణంలోని పలు కాలనీల్లోని సుమారు 150 విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఐదు రోజుల పాటు మండపాల వద్ద ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ రకాల ఆటల పోటీలతో పాటు అన్నదానం చేశారు. చివరి రోజు బుధవారం ఉదయం ప్రత్యేక పూజలు అనంతరం గణపతి బొప్పా మొరియా అంటూ గణనాథులను నిమజ్జనానికి తరలించారు. వాహనాల ముందు డప్పు వాయిద్యాలు, నృత్యాలతో చిన్నాపెద్దా, ముస లిముతక సందడి చేశారు. అనంతరం మండలంలోని వెంకటాపురం చెరువులో నిమజ్జనం చేశారు. శోభా యాత్రలో యువకులు ఉత్సాహంగా డ్యాన్సులు చేస్తూ నెమ్మదిగా రావడంతో నిమజ్జన కార్యక్రమం అర్ధరాత్రి వరకు జరిగింది. ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, తహసీల్దార్ నాగమణి, సీఐలు సీఐలు ఇంతియాజ్‌బాషా, రాకేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఊరేగింపులో యువత కోలాహలం



వెంకటాపురం చెరువుకు జలహారతి ఇస్తున్న ఉత్సవ కమిటీ

స్వామి వివేకానంద ప్రసంగం.. స్ఫూర్తి మంత్రం

డోన్ టౌన్: భారతదేశ హిందూ సంప్రదాయాలను, సంస్కృతిని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలని వివేకానంద సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జగన్‌మోహన్, గౌరవ అధ్యక్షుడు సప్తశైల తిమ్మయ్య, కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసు అన్నారు. 1893 సెప్టెంబర్ 11వ తేదీ చికాగో నగరంలో స్వామి వివేకానంద ఇచ్చిన ఐదు నిమిషాల ప్రసంగానికి ప్రపంచదేశాల ప్రతినిధులు మంత్రముగ్ధులయ్యారని తెలిపారు. ఆయన ప్రసంగానికి బుధవారంతో 130 ఏళ్లు పూర్తయిన సందర్భంగా డోన్ ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఉన్న వివేకానంద విగ్రహానికి పూలమలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వామి వివేకానంద జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకాలను ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్ నాగమణి, సీఐ ఇంతియాజ్‌బాషాకు అందజేశారు.



వివేకానంద విగ్రహం వద్ద సేవా సమితి సభ్యులు

కాటసాని ప్రసాదరెడ్డికి మాతృవియోగం

బనగానపల్లె/అవుకు: మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత కాటసాని ప్రసాదరెడ్డి తల్లి కాటసాని ఈశ్వరమ్మ(73) బుధవారం బనగానపల్లెలోని ఇంట్లో గుండెపోటుతో మృతి చెందారు. ఆమె మృతదేహానికి కాటసాని రామిరెడ్డి, జయమ్మ దంపతులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డి, చల్లా విఘ్నేశ్వరరెడ్డి, అవుకు ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయంత్రం స్వగ్రామమైన అవుకు మండలం గుండ్లశింగవరంలో అంత్యక్రియలు నిర్వహించారు. కాగా ఈమెకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.



కాటసాని ఈశ్వరమ్మ(ఫైల్)



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

పోటాపోటీగా లడ్డూ వేలం

డోన్ టౌన్: పట్టణంలో వినాయకుడి లడ్డూలతో పాటు తలపాగాకు వేలం నిర్వహించారు. దక్కించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. పాతపేట అంకాలమ్మ గుడి వద్ద కోలువైన వినాయక లడ్డూను అదే కాలనీకి చెందిన శంకర్ రూ.50001కి కైవసం చేసుకున్నారు. పట్టణంలోని 26వ వార్డులో కొలువుంచిన కాణిపాక వినాయక లడ్డూను బత్తిని మునిస్వామి రూ.23 వేలకు, అదే మండపంలో మరో చిన్న లడ్డూను వెంకటమ్మ రూ.14,500లకు దక్కించుకున్నారు. పాతపేటలోని రాముల దేవాలయం వినాయక మండపంలో తల పాగాను రూ.39వేలకు పార్థురెడ్డి కైవసం చేసుకున్నారు.



వినాయకుడి లడ్డూను దక్కించుకున్న భక్తుడు

పంట నమోదుకు 15న ఆఖరు

బేతంచెర్ల: మండలంలో వివిధ పంటలు సాగుచేసిన రైతులు సెప్టెంబర్ 15వ తేదీలోగా పంట నమోదు చేసుకోవాలని ఏఓ కిరణ్‌కుమార్ తెలిపారు. ఇప్పటి వరకు 31 వేల ఎకరాల్లో పంట నమోదు పూర్తయినట్లు చెప్పారు. మిగిలిన రైతులు రైతు సేవా కేంద్రంలో సంప్రదించి త్వరగా నమోదు చేయించుకోవాలన్నారు. లేకుంటే ప్రభుత్వం నుంచి రుణాలు, రాయితీలు అందవని తెలిపారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు రాజేశ్వరి, స్వాతి ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్యాపిలి: మండల పరిధిలోని నల్లమేకలపల్లి ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏఈ వినయ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఆర్ పల్లి, గుడిపాడు, నల్లమేకలపల్లి, మామిళ్లపల్లి, జక్కసానికుంట్ల, డి.రంగాపురం, వెంకటకొండాపురం తదితర గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డా

డోన్: పట్టణంలోని పాత జూడీల ఫ్యాక్టరీని సుమారు కోటి రూపాయలతో పునర్నిర్మించి శేషారెడ్డి నైపుణ్య అభివృద్ధి కేంద్రంగా అధికారులు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంగణంలో మెప్మా, హౌసింగ్ కార్యాలయాలు కూడా ఉండడంతో చుట్టూ ప్రహరీని నిర్మించారు. అయితే ప్రహరీ ప్రధాన గేటుకు తాళాలు వేయకుండా స్థానిక కూరగాయల వ్యాపారులు, ప్రైవేటు వాహనాల యజమానులకు అప్పగించడంతో ప్రహరీలోపల ఆటస్థలంగానూ, ప్రైవేటు వాహనాల పార్కింగ్‌కు వినియోగిస్తున్నారు. కుక్కలు, పందులు స్వైర విహారం చేయడంతో పాటు రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలు కూడా జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ అధికారులు ప్రహరీ ప్రధాన గేటుకు తాళాలు వేయాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రభుత్వ కార్యాలయ ప్రహరీలో నిలిపిన ప్రైవేటు వాహనాలు

బోధన.. వేదన

- ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత
- అరకొర పీఈటీలతో ఆటలకు దూరం

కొలిమిగుండ్ల: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరతతో బోధన కుంటుపడుతోంది. షెడ్యూల్ ప్రకారం సిలబస్ ముందుకు సాగడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో ఇతర సబ్జెక్ట్ బోధించే ఉపాధ్యాయులతో విద్యార్థులకు పాఠాలు చెప్పించాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా సిలబస్ పూర్తి కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధ్యాయుల కొరత ఉండడంతో పదో తరగతి పబ్లిక్ పరీక్షలపై ప్రభావం పడుతుందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో పది ఉన్నత పాఠశాలలు, మోడల్‌స్కూల్, కస్తూర్బా పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 2,973 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. సుమారు పదిహేను మంది సబ్జెక్ట్ టీచర్ల లోటు ఉంది. 1957లో కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల ప్రారంభమైంది. ఇక్కడ చదువుకున్న వాళ్లు ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో ఉన్నారు. అయితే ప్రస్తుతం ఈపాఠశాలలో హెచ్‌ఎం, ఇద్దరు తెలుగు ఉపాధ్యాయులు, పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు తెలుగు బోధించేందుకు ఒక్క ఉపాధ్యాయుడే రెండు సెక్షన్లకు పాఠాలు చెప్పాల్సి రావడంతో సంబంధిత ఉపాధ్యాయుడికి తలకు మించిన భారం అవుతోంది. పెట్నికోట ఉన్నత పాఠశాలలో బయాలజీ సైన్స్ బోధించేందుకు ఏడాది నుంచి ఉపాధ్యాయుడు లేకపోవడంతో హెచ్‌ఎం తనకున్న పరిజ్ఞానంతో పాఠాలు చెప్పాల్సి వస్తోంది. మిగిలిన ఉన్నత పాఠశాలల్లో ముఖ్యమైన సబ్జెక్ట్‌లకు టీచర్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటికి తోడు 12 పాఠశాలలకు గాను తొమ్మిది మంది మాత్రమే పీఈటీలు ఉన్నారు. దీంతో విద్యార్థులకు ఆటలు ఆడేందుకు అవకాశం లేకుండాపోయింది. ప్రభుత్వం డీఎస్సీని వచ్చే ఏడాదికి వాయిదా వేయడంతో టీచర్ల భర్తీ ఈ విద్యాసంవత్సరంలో లేనట్లే. ఈలోగా విద్యా వలంటీర్ల నియామకం చేపట్టి విద్యాబోధన కుంటుపడకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.



పెట్నికోట ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు



బురదమయంగా మారిన పార్కు రోడ్డు



ఎన్జీవోస్ కాలనీలో నిలిచిన నీరు

చినుకు పడితే చిత్తడే

బేతంచెర్ల: పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీ, పార్కు, ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో ఉన్న కాలనీలు చినుకు పడితే చిత్తడిగా మారుతున్నాయి. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆయా వీధుల్లో వర్షపు నీరు నిలిచిపోయాయి. మరికొన్ని చోట్ల రోడ్లు బురదమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బురదలోనే నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. నగర పంచాయతీ అధికారులు స్పందించి వర్షం నీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలని..ఖాళీ స్థలాల్లోని పిచ్చిమొక్కలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.